# న్యాయం

వేసాకాలి కీళ్ళు టప టప మన్నవి. ప్రేవులు కటకట మంటూ శ్రుతి కలిపింది. "ఎర్రటి ఎండ. పైన తల మాడిపోతున్నది. ఎప్పుడో పొద్దున్న వేలు అదెట్టిన కూడు. మళ్ళీ ఈయాల దాకా ఏమీ లేదు. కడుపులో పేగులు అరుత్తున్నయ్. కాసంత ఆకాశా గాడి కాడ కాసిన్ని టీనీల్ళు లేందే కట్టుమవుద్ది" అను కున్నాడు లింగయ్య ఉసూరు మంటూ.

గవర్నరుపేట రోడ్డున బోతే ఏదన్నా బాడుగ దొరకొచ్చు. చెమటలు కక్కుతున్నాడు లింగయ్య. సైకిల్ రిక్షాకూడా అలసిపోయిందేమో మెల్లగా పోతున్నది. లింగయ్య ఒంటిమీద బనీను చెమటతో తడిసిపోయింది.

"దీ నక్క బతుకు! ఏం బతుకు. సిచ్చు బతుకు. పాడు బతుకు ఎంత ఒళ్లిరుసుకొన్నా కడుపునిండా కూడు దొరకదయ్యే. ఒళ్ళుకు ఒళ్ళు పనికి రాకుండా పోద్ది. ఈ మద్దిన దగ్గు గూడా తగులుకుంది. ఏటో! అంతా ఆ భగమంతుడే సూడాలి. అయినా ఏటో ఈ పిచ్చి! ఏడన్నా భగమంతుడుంటే ఇన్ని అన్నేయాలు జరుగుతయ్యా. అంతా బొంకు. అంతే గాని భగమంతు డేడ. వేదాంతం కూడా తొంగి చూస్తున్నది పాతి కేళ్ళ లింగయ్య కప్పుడే.

ఇంతలో రానే వచ్చింది రిక్షావాళ్లకు అమృతం బోసే సోటు. ఈ టీనీళ్లే లేకపోతే ఏ పని జరుగుద్ది. ఆఫీసర్లు యియ్యలేకపోతే సరిగా పనిచేస్తరా? రిక్షా వాళ్ళు తొక్క గల్గుతురా? అసలు యీ టీనీళ్ళు లేందే యున్ని హోటళ్ళు ఎందుకు అనుకున్నాడు లింగయ్య.

"ఏక్ తడప్ చా" అరిచాడు. సర్వరు తీసుకు రావటాని కెళ్ళాడు. వాడు తెచ్చిన టీనీళ్ళు తాగి తిరిగి బయల్దేరాడు జీవనోపాధికి.

మునిసిపలు హైస్కూలు యిడిసేటయింది. అటు తిన్నగా తిప్పేడు రిక్షా.

కాస్సేపు నిల్చునేటప్పటికి స్కూలు విడిచారు. కాని లింగయ్యకు బాడుగ దొరకలేదు. అందరూ వెళ్ళి పోతున్నారు. ఈసురు మంటూ వెనక్కి తిరగ బొయ్యాడు లింగయ్య.

ఇంతలో "ఏయ్ రిక్షా" విస్సగా వినబడింది.

లింగయ్య ముఖంలో ఆశ తళుక్కుమన్నది. వెయ్యి కళ్ళు చేసుకు చూశాడు. ఎవరో ఒక్క పంతులి అమ్మాయి. క్రిష్టియను పంతులమ్మేమో! సన్నగా వుంది చేతిలో గొడుగు. ఇటువంటివాళ్ళు ఎప్పుడూ నా రిక్షా ఎక్కరే. ఇట్లేదున్నా నడిచి పోతారు. అయ్యాల రిక్షా ఎక్కటానికి ఒంట్లో బాగుండ లేదేమో!

"ఏమ్మా? ఏడకి?"

"బాడవ పోవాలి. ఏం తీసుకొంటావ్?"

"మూడణా లిప్పించండమ్మా"

"బేడ యిస్తాను. యిస్తే పదయితేరా"

"సరే, ఎక్కండమ్మా"

రిక్షా ఒక ఫర్లాంగు నడిచింది. వెనకాల యిద్దరు కుర్రాళ్ళు యీలలేసుకుంటూ వెంట బడ్డారు. రిక్షా ప్రక్కనుంచి రెండుసార్లు ముందుకు పోయారు. మళ్ళీ నెమ్మదిగా వెనక పడ్డారు.

"ఏయ్. రాణమ్మా. ఓస్ ఏం టెక్కులు. రేపు ఖాళీ యేగా ఓడికి సెలవు గదూ! సినిమా కొస్తావా?"

"ఏం? మాట్లాడవ్? ఒరేయ్ రిక్షా! ఆపరా. ఏయ్ రిక్షా ఆపమంటే నీ కెంత పొగరు బలిసిందిరా పందీ! ఆపు" ఇట్లా ఏడిపించి చివరకు రిక్షా ఆపించారు ఆఖరికి ఆ కుర్రాళ్ళు.

"ఏటయ్యా, ఏం గావాలి?" నా రెండు కా పేరో తెలిసి మర్యాదగా అడిగాడు లింగయ్య. మండిపోయింది వాళ్ళు తిట్టేసరికి. అయినా నిమ్మళించాడు.

శ్రీమతి కన్నెగంటి [illegible]

"ఏం కావాలేంటిరా! ఏం యిందాకటినుంచి ఆప మంటే ఆపవేం!" మీద కొచ్చా డొక కుర్రాడు.

లోపల కూర్చున్న పంతులమ్మ వాళ్ళ బాధ పడ లేకనే రిక్షా ఎక్కింది. అయినా వాళ్ళేదో అఘా యిత్యం చేసేటట్టున్నారు. వెధవలు రౌడీలు? అను కొంది మనసులో. వాళ్ళు రిక్షా ఆపి మీద కెక్క సరికి బిత్తరపోయి చూస్తున్నది.

"ఏమిటయ్యా! మీరు చదువుకునే వోళ్లే గందయ్యా మీరే యిట్ట రౌడీలల్లే సేత్తే ఎట్టా?" లింగయ్య వాళ్ళ తప్పు తనకు తోచిన మాటల్లో తెలియ చెప్పబొయ్యాడు.

ఆ యిద్దర్లో ఒక కుర్రాడు పెద్ద అవమానం పొందినట్లు కోపం తెచ్చుకున్నాడు ఈ మాటలకు.

"ఏంరా! ఏం బలిసింది లాగుంది! రౌడీలంరా?" అని అంటూనే మీద కొచ్చి కొట్టాడు చెంపమీద లింగయ్యని.

లింగయ్యకి పౌరుషం పుట్టుకొచ్చింది వాళ్ళు చేస్తున్న పనులకు. ఏదో మరియాదగా చెప్పేతలికే బూతులు తిట్టేరు నాయాళ్ళు. పూరకనే యీడిసి కొట్టేడు. ఇంతా చేస్తే పిడికెడు లేడు వోక్కడు అను కుని మండిపోయాడు.

"ఎట్టా యిందాకట్నుంచి. మీ రౌడీ యేసాలు ఈడి దగ్గరా? అంటూ తన్ని కొట్టిన కుర్రాణ్ణి నేల కరిపించాడు లింగయ్య రిక్షా తొక్కంగా కరగ్గా మిగిలిన కండలతో. ఆ దెబ్బకు రెండోవాడు పరుగెత్తి పోయాడు వెనక్కి. మొదటివాడు తేరుకుని లేచే టప్పటికి రిక్షా కదలిపోయింది.

"ఏటమ్మా. ఇది నాయమయిన మనుషులుండే సోటుగాదమ్మా యిప్పుడు. లేకపోతే బక్క వెధవలు మీది కొత్తారా ఎనకా ముందు సూడకుండా? రేపటే ట్నుంచి మీ మాట తలుత్తారేమో సూడండి! బాగా బుద్దొత్తాది ఎదవలకి" అంటూ ఏమంటుందోనని వెనక్కి తిరిగి చూచిన లింగయ్య ఆమె కళ్ళల్లో నిండిన కృతజ్ఞత చూచి తృప్తిపడ్డాడు. రిక్షా సాగిపోయింది.

మర్నాడు ఆదివారం. చర్చికి బయలుదేరింది పంతు లమ్మ రాణి. మిషన్ హైస్కూలు కెళ్ళి వాళ్ళతో పాటు కలిసి వెళ్ళుతుంది ప్రార్థనకు. మామూలుగా మిషను వాళ్ళతో కల్సి బయలుదేరింది. చర్చి దగ్గర కొచ్చేటప్పటికి ఏదో జనం మూగి వున్నారు ప్రక్క రోడ్డుమీద. ఏమేమో తిట్లూ, అప్పు డప్పుడు పెడ బొబ్బలు అరుపులు వినవస్తున్నయ్.

నల్గురైదుగురు మనుష్యులు ఎవర్నో కొడు తున్నారు కిందపడేసి. జనం గూడా తమాషా చూస్తూ నిల్చున్నారు. కాని ఎవడు ముందుకు వచ్చి పోట్లాట ఏమిటని అడిగినవాడు లేడు. రోడ్డు ప్రక్కగా రిక్షా ఒకటి చక్రాలు వంకర్లుపోయి పడివుంది.

ఒక క్షణం కనపడింది పంతులమ్మకు రిక్షావాని రక్తసిక్తమయిన మొహం. ఒక్క వేడి నిట్టూర్పు వదిలింది. కనుకొలకుల్లో నీళ్ళు తిరిగినవి. ఎవరూ చూడకుండా తుడుచుకొంది.

ఆవేళ ప్రార్థన సమయమంతా ఆ రిక్షావాని రక్తం కారుతున్న మొహాన్ని గురించే ఆలోచించింది.

ప్రార్థన అయిన తర్వాత చర్చి ఫ్యాను చెప్తున్నాడు దొరసానమ్మకు విషయ మంతా.

విందామని ఆత్రంగా నడిచి వారిని సమీపించి "ఇందాక ఏమయింది? రిక్షా అతను ఏమయ్యాడు? బాగా దెబ్బలు తగిలాయా? యిప్పు డెక్కడున్నాడు?" అని అడిగింది ఆత్రంగా ఎవర్ని అడుగుతున్నదో కూడా ఆలోచించకుండా.

ఆమె పడుతున్న బాధ చూసేసరికి ప్యూనుకు, దొరసానికి బాగా ఆశ్చర్యం వేసింది.

ప్యూన్ చెప్తున్నాడు. ఆమె చెవులు వింటున్నాయ్.

"వాడు నిన్న ఒక కుర్రాణ్ణి ఒంటరిపాటున కొట్టేడంటమ్మగారూ! అందుకని వాణ్ణి కాచి పట్టుకుతన్నేరు. వెధవ. అట్లాగే జరగాలండమ్మా ఆ వెధవలకి. ఆసుపత్రికి తీసుకుపోయారు."

ఇంకా ప్యూన్ వ్యాఖ్యానం వినలేని పంతులమ్మ పరపరా నడిచి వెళ్ళిపోయింది.

"నాయానికి సోటు లేదండమ్మా" అన్న రిక్షావాని మాటలు చెవుల్లో గింగురుమన్నై. ★